క్లుప్తంగా

రూ.18.73 కోట్ల బ్యాంక్ రుణాలు



మాట్లాడుతున్న ఏరియా కోఆర్డినేటర్ మురళి

పెళ్లకూరు: మండలంలోని పొదుపు మహిళలకు రూ18.73కోట్ల బ్యాంక్ రుణాలు అందించినట్లు ఇందిరక్రాంతి పథం ఏరియా కో–ఆర్డినేటర్ మురళి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఇందిక్రాంతి పథం కార్యాలయంలో సీహెచ్ సిద్ధమ్మ అధ్యక్షతన జరిగిన సంఘమిత్ర మొదటి సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంక్ రుణాల లక్ష్యం మార్చి నెలాఖరుకి రూ.25 కోట్లు పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. స్త్రీనిధి రుణాల్లో రికవరీకి సంబంధించి వీఓఏలు సక్రమంగా పనిచేయాలని అన్నారు. పౌష్టికాహారం కింద మహిళా సంఘ సభ్యులకు పెరటికోళ్లు పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఏపీఎం మునిరాజయ్య, బ్యాంక్ మేనేజర్ వివేక్, సిబ్బంది మాధవ్, గురుస్వామి, సురేఖ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



క్రీడా సామగ్రిని అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

గూడూరు: గూడూరు లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని లయన్స్ గవర్నర్ రామచంద్రరావు పేర్కొన్నారు. పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, సరస్వతీ శిశు మందిరం, బాలసదన్‌లలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పంచాయితీరాజ్ ఈఈ గిరినాథ్ దాతృత్వంతో విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందజేశారు. అదే విధంగా సరస్వతీ విభు మందిరంలో పలువురు పేదలకు ఫలసరుకులు అందజేశారు. అలాగే రెండవ పట్టణంలోని బాలసదన్‌కు గ్లేజ ర్‌ను అందజేశారు. డిస్ట్రిక్ట్ చైర్మన్‌లు రియాజ్ అహ్మద్, మురళీరెడ్డి, రామ్మోహన్‌రావు, శ్రీరా ములు, వెంకటలక్ష్మి, రూపేష్‌రెడ్డి పాల్గొన్నారు.

రైల్వే ఆస్పత్రిలో ఉచిత వైద్యశిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

గూడూరు: స్థానిక రైల్వే ఆస్పత్రిలో సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజన్ డీఆర్‌యూసీసీ సభ్యుడు బి. శ్యాంసుందర్‌రావు ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. నెల్లూరులోని మెడికోవర్, ధాత్రి ఆస్పత్రులకు చెందిన వివిధ విభాగాల వైద్యనిపుణులు జయరాం, ఫిరోజ్, దిలీప్‌కుమార్, వేదవల్లి వాణిశ్రీ వైద్యపరీక్షలు చేశారు. రైల్వే డాక్టర్ శ్రీనివాససుందర్‌కుమార్, రైల్వే ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

అగ్గితెగులు నివారణపై ప్రత్యేక దృష్టి

వెంకటగిరిరూరల్: ప్రస్తుతం సాగులో ఉన్న వరి పంటకు అగ్గితెగులు అధికంగా ఉందని ఈ మేరకు రైతులు అప్రమత్తం కావాలని వ్యవసాయశాఖ ఏడీఏ నాగార్జునసాగర్ పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో మండల గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఏఓ సుజాత, విస్తరణ అధికారి రామ్మోహన్, గోపికృష్ణ పాల్గొన్నారు.

అన్నదానం



సోమేశ్వరస్వామి ఆలయం వద్ద అన్నదానం

గూడూరురూరల్: పట్టణంలోని త్యాగరాజావీధిలో వెలసిన మీనాక్షిదేవి సమేత సోమేశ్వర స్వామి ఆలయంలో బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి అన్నదాతలుగా బీజేపీ నేతలు వ్యవహరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నదానం స్వీకరించారు.

యువకుడు ఆత్మహత్య

నాయుడుపేటటౌన్: తమిళనాడు ప్రాంతానికి చెందిన యువకుడు మేనకూరు సమీపంలో ఉన్న ఓ అపార్టుమెంట్‌లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనను పోలీసులు బుధవారం రాత్రి గుర్తించారు. తిరువళ్లూరు జిల్లా, షోలింగరమ్ తాలుకా పుదూరు గ్రామానికి చెందిన ఏ సూర్య(24) మేనకూరు సెజ్ పరిధిలోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. మేనకూరు సమీపంలో ఓ అపార్టుమెంట్‌లో ఓ గది అద్దెకు తీసుకుని ఐదుగురు యువకులతో కలిసి ఉంటున్నాడు. బుధవారం యథావిధిగా గదిలో ఉన్న యువకులు విధులకు వెళ్లారు. సూర్య మాత్రం రూములోనే ఉన్నాడు. రాత్రి విధులు ముగించుకుని వచ్చిన యువకులు వచ్చి తలుపులు తట్టినా తెరవకపోవడంతో అనుమానం వచ్చి కిటికిలోంచి చూశారు. ఫ్యానుకు ఉరేసుకుని వులాడుతుండడాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ ప్రభాకరర్‌రావు అపార్టుమెంట్ వద్దకు చెరుకుని యువకుడి మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వెంకటగిరి ప్రగతికి సమష్టిగా కృషిచేద్దాం

- తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి

వెంకటగిరి: వెంకటగిరి ప్రగతికి మున్సిపాలిటీలోని 25 మంది కౌన్సిలర్లతో కలిసి సమష్టిగా కృషిచేద్దామని తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక నేదురుమల్లి నివాసంలో బుధవారం పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు నేదురుమల్లిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై నమ్మకంతో మున్సిపాలిటీలో 25వార్డుల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలిచారని, ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముచేయకుండా వెంకటగిరిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషిచేయాలని సూచించారు. వెంకటగిరిలో ఇండియన్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీని మరింత అభివృద్ధి చేసేలా ప్రణాళికలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని, గురువారం ఆ శాఖ ప్రిన్స్‌పల్ సెక్రటరీ స్థానిక ఐఐహెచ్‌టీని సదర్శించే అవకాశం ఉందన్నారు. సంక్షేమం, అభివృద్ధి రాష్ట్రప్రభుత్వ ప్రాధాన్యతాంశాలు అని తెలిపారు. వెంకటగిరిలో పార్టీ కార్యాలయం కొద్దినెలల్లోనే నిర్మాణం పూర్తిచేసుకుని అందుబాటులోకి వస్తుందన్నారు.

మున్సిపల్ చైర్‌పర్సన్ భానుప్రియ, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వెంకటేశ్వరరావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఉమామహేశ్వరి, న్యాయవాది ఎల్ కోటీశ్వరరావు, నేతలు శంకరరెడ్డి, సురేష్‌రెడ్డి, పి ప్రసాద్‌రెడ్డి, బి రమేష్‌రెడ్డి, ఎంపీపీలు గూడూరు భాస్కర్‌రెడ్డి, గోను రాజశేఖర్, సొసైటీ అధ్యక్షుడు కార్తీక్‌రెడ్డి, వేణునాయుడు, నాగేశ్వరరావు, కౌన్సిలర్లు ప్రభావతి, విజయలక్ష్మి, మున్సిపల్ విప్ పూజారిలక్ష్మి, కె కల్యాణి, ఎస్ శేఖర్, గోపాలకృష్ణ, చంద్రశేఖర్‌రెడ్డి, మున్సిపల్ లీగల్ అడ్వైజర్ జయప్రకాష్‌జెట్టి పాల్గొన్నారు.

వాడివేడిగా సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ భవాని

కోట: మండల సర్వసభ్య సమావేశం బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దాసరి అంజమ్మ అధ్యక్షతన జరిగింది. అన్ని శాఖల అధికారులు సమావేశానికి హాజరై తమ శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధిని వివరించారు. కోట పట్టణంలో ఆక్రమణల తొలగింపుపై సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగింది. ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న క్రమంలో కోట పట్టణంలో ఆక్రమణలు తొలగించి రోడ్లు వెడల్పు చేయాలని ప్రజాప్రతినిధులు అధికారులను కోరారు. అదేవిధంగా కోట క్రాస్‌రోడ్డు నుంచి గాంధీబొమ్మ సెంటర్ మీదుగా కొక్కుపాడు రోడ్డు వరకు సీసీరోడ్డు నిర్మాణం, రెండు వైపుల డ్రైనేజీ కాలువలు నిర్మించాలని కోరారు. కోటలో పంటకాలువలు ఆక్రమణలకు గురవుతున్నాయని, కాలువలపై నిర్మాణాలను తొలగించాలని కోరారు. శునకాల సంఖ్య విపరీతంగా పెరిగిపోతున్న క్రమంలో కుక్కకాటు బాధితులు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారని, నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కొందరు సర్పంచ్‌లు అధికారులను కోరారు. కోట హరిజనవాడ, శ్యాంసుందరపురంలో లోఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని ఎంపీటీసీ సభ్యుడు మొబీన్ అధికారులను కోరారు. గత సమావేశంలో చేసిన తీర్మానాలు ఎంత వరకు అమలు చేశారన్న దానిపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భవాని, తహసీల్దార్ పద్మావతి, జెడ్పీటీసీ కోటయ్య, వైస్ ఎంపీపీలు సౌజన్యరెడ్డి, శేషయ్య పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సరిచేసుకోవాలి

దక్కిలి: ఉపాధ్యాయ, పట్టభద్రుల, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళిని అనుసరిస్తూ ఓటర్ల జాబితాలోని చిన్న పొరపాట్లను గుర్తించి సరిచేయాలని తహసీల్దార్ రమేష్‌బాబు తెలిపారు. స్థానిక వైకేపీ కార్యాలయంలో బుధవారం వీఆర్వోలు, అన్ని సచివాలయ సిబ్బంది, బీఎల్వోలతో కలిసి సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాను ఎలా నిర్వహించాలి అనే అంశాలపై తెలియజేశారు. ఎన్నికల సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని సిబ్బందిని ఆదేశించారు.

ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తే చర్యలు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని ప్రధాన రహదారుల్లో ఇష్టారాజ్యంగా భారీ వాహనాలు, ఆటోలు రాకపోకలు జరిపి ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవంటూ ఎస్ఐ వేణు హెచ్చరించారు. పట్టణంలోని పలు ప్రధాన రహదారులపై ఇష్టారాజ్యంగా రాకపోకలు జరుపుతున్న పలు ఆటోలు, వాహనాల రికార్డులను పరిశీలించారు. వీటిలో నిబంధనలకు విరుద్ధంగా లైసెన్సులు లేకపోవడం, రికార్డులు సరిగాలేనివారిని గుర్తించి ఈ–చలానా విధించారు. హెడ్‌కానిస్టేబుల్ రామ్మోహన్‌రాజు, దయాకర్ పోలీస్ సిబ్బందితో వాహనాలను విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.

నోరు అదుపులో పెట్టుకో



మాట్లాడుతున్న ముస్లిం మైనార్టీ నేతలు

గూడూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై టీడీపీ నేతలు అవాకులు, చవాకులు పేలితే సహించేది లేదని మైనార్టీ నేతలు హెచ్చరించారు. స్థానిక సాదీ మంజిల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మగ్దూం మోహిద్దీన్ మాట్లాడుతూ మైనార్టీ సంస్థల ముసుగులో ఫారూఖ్ షబిలీ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడం తగదన్నారు. అలాగే గెలవడం అంటే తెలియని లోకేష్ కూడా సీఎంను కించపరచేలా మాట్లాడుతున్నాడని, ఆయనకు జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి లేదన్నారు. అనంతరం జిల్లా వక్ఫ్ బోర్డు ఉపాధ్యక్షుడు సయ్యద్ అబ్దుల్ గఫూర్ మాట్లాడుతూ ఈ ప్రభుత్వంలో కక్ష సాధింపు దోరణి లేవన్నారు. టీడీపీ నేతలు, లోకేష్‌లు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని హితువు పలికారు. సమావేశంలో నాజర్, షబ్బీర్, యస్థానీ, జలీల్, నజీర్, ఫారూఖ్, కరీముల్లా పాల్గొన్నారు.

గేదెను ఢీకొన్న బైక్

చిల్లకూరు: గేదెను బైక్ ఢీకొన్న ఘటనలో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. నాంచారమ్మపేట గ్రామ సమీపంలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. తిమ్మనగారిపాళెం గ్రామానికి చెందిన శ్రీనివాసులు గూడూరులో పనులు ముగించుకుని బైక్‌లో ఇంటికి బయలుదేరారు. నాంచారమ్మపేట సమీపంలో వెళుతుండగా హఠాత్తుగా రోడ్డుకు అడ్డుగా గేదె రావడంతో అదుపుతప్పి దాన్ని ఢీకొంది. ఈప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వ్యక్తిని స్థానికులు గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు.

జగనన్న గోరుముద్ద తనిఖీ



నరసనాయుడుపల్లి ప్రాథమిక పాఠశాలలో భోజనం తనిఖీ చేస్తున్న ఎంఈఓ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈఓ

దక్కిలి: ప్రభుత్వ స్కూళ్లలో అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని కొత్త మెనూతో పక్కాగా అమలు చేయాలని ఎంఈఓ కె.వెంకటేశ్వర్లు ఆదేశించారు. నరసనాయుడుపల్లి ప్రాథమిక పాఠశాలలో ఆయన బుధవారం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ ప్రతిరోజూ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి, విద్యార్థుల హాజరు, రికార్డులను తనిఖీ చేశారు.

దొరవారిసత్రం: తల్లంపాడు గ్రామ పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో అమలవుతున్న జగనన్న గోరుముద్ద కార్యక్రమ నిర్వహణను ఎంఈఓ మస్తానయ్య బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థుల కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. హెచ్‌ఎం హుస్సేనయ్య, టీచర్ శ్రీనివాసులు ఉన్నారు.

వృద్ధాశ్రమానికి దాతల చేయూత

నాయుడుపేటటౌన్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం సమీపంలో ఉన్న మేరి వృద్ధాశ్రమానికి పలువురు దాతలు చేయూత అందించారు. బుధవారం తుమ్మూరు గ్రామానికి చెందిన సుకుమార్, సంధ్య దంపతులు వారి కుమారుడు హోషిత్ రామ్‌తో కలిసి ఆశ్రమంలో జరుగుతున్న నిర్మాణ పనుల కోసం రూ.10 వేల నగదును విరాళంగా అందజేశారు. ఆశ్రమంలోని వృద్ధులకు బిర్యానీ ప్యాకెట్‌లను పంపిణీ చేశారు. నిరాశ్రయులుగా ఉన్న వృద్ధులను చేరదిసి వారికి అన్ని వసతులు కల్పిస్తున్న ఆశ్రమ నిర్వాహకులు సునిత, బెన్నీలను అభినందించారు.

నేరాల నియంత్రణే లక్ష్యం



ఆటోవాలాలకు స్టిక్కర్లను అందజేస్తున్న డీఎస్పీ

గూడూరు: నేరాలను నియంత్రించాలనే లక్ష్యంతోనే ఆటోడ్రైవర్లకు డిజిటల్ క్యూఆర్ కోడ్ స్టిక్కర్లను అందజేస్తున్నామని డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని పాతబస్టాండ్ ప్రాంతంలోని టవర్ క్లాక్ సెంటర్ వద్ద బుధవారం ఆటోడ్రైవర్లకు డీఎస్పీ చేతులమీదుగా స్టిక్కర్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ నేరాలు, ఇతర నేర ప్రవృత్తి కలిగిన వ్యవహారాలు నిర్వహించేవారు ఆటోలనే ఎక్కువగా ఉపయోగిస్తారన్నారు. ఈ క్రమంలో ఆటోలకు డిజిటల్ క్యూఆర్ కోడ్ స్టిక్కర్‌లను డిస్‌ప్లే చేయడం ద్వారా, ఆటోడ్రైవర్‌తోపాటు, యజమానికి సంబంధించిన పూర్తి వివరాలు ఉంటాయన్నారు. దీంతో ఎక్కడైనా ఎలాంటి నేరం జరిగినా, వెంటనే గుర్తించేందుకు స్టిక్కర్‌లు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. 1వ, 2వ పట్టణ సీఐలు హజరత్‌బాబు, వెంకటేశ్వరరావు, ఎస్ఐ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు



సూళ్లూరుపేట: పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో వెలసిన గంగా పార్వతి త్రినేత్ర సంభూతుడైన శ్రీ నాగేశ్వరస్వామి ఆలయంలో గురువారం నుంచి 21 తేదీ వరకు మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పాంచాహ్నిక బ్రహ్మోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయం చైర్మన్ చెన్నారెడ్డి సుబ్రమణ్యంరెడ్డి (స్వామిరెడ్డి), ఆలయ ఈఓ మమత ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం సాయంత్రం 4 గంటలకు గ్రామశక్తి చెంగాళమ్మ పరమేశ్వరీ ఆలయం ఆవరణలో పుట్టమట్టి స్వీకరణ, అమ్మవారి ఆజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. చెంగాళమ్మ ఆలయంలో స్వీకరించిన పుట్టమట్టి ఇక్కడ నుంచి నాగేశ్వరాలయం దాకా ఊరేగింపుగా కోలాహలంగా తీసుకెళ్లనున్నారు. సాయంత్రం 6.30 నుంచి 10. 30 దాకా విఘ్నేశ్వరపూజతో ఉత్సవాలను ప్రారంభించనున్నామని స్వామిరెడ్డి తెలిపారు. భక్తులు బ్రహ్మోత్సవాలకు విచ్చేసి శివపార్వతుల కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని కోరారు.

మురుగునీరు రాకుండా చర్యలు

గూడూరు: పట్టణంలోని పలు ప్రాంతాల్లోని కొళాయిల్లో మురుగునీరు వస్తోందని, దీంతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారని, ఇకనైనా కొళాయిల్లో మురుగునీరు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆలిండియా తన్జీమ్ ఏ ఇన్సాఫ్ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ మేరకు వారు బుధవారం మున్సిపల్ కమిషనర్ సాయినాథ్‌కు వినతి పత్రం అందజేశారు. యస్థాని, కాలేషా, జమాలుల్లా, చాన్‌బాషా, మన్సూర్, ఫరూక్ పాల్గొన్నారు.

రూ.12 కోట్లతో జలజీవన్ మిషన్ పనులు



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ భాస్కర్

సైదాపురం: జలజీవన్ మిషన్ పథకం ద్వారా రూ.12 కోట్లతో 56 పనులను మండలంలో చేపట్టామని అధికారులు తెలిపారు. సైదాపురంలో బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ పెంచలమ్మ అధ్యక్షతన ఎంపీడీఓ ఎం వెంకటేశ్వర్లు మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. సర్వసభ్య సమావేశాలకు డుమ్మా కొట్టే అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలంటూ మండల ఉపాధ్యక్షుడు భాస్కర్ డిమాండ్ చేశారు. అలాగే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పేదలకు సరైన వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సిబ్బంది పనితీరు కూడా బాగా లేదన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ దృష్ట్యా అభివృద్ధి పనులకు ఎలాంటి తీర్మానాలను ఆమోదించడం లేదని ఎంపీడీఓ స్పష్టం చేశారు. అలాగే ఎన్నికల నియమావళిని ప్రజాప్రతినిధులు పాటించాలన్నారు. ఎంఈఓ దయాకర్ మాట్లాడుతూ నాడు –నేడు రెండో విడత ద్వారా మండలంలోని 22 పాఠశాలల రూపురేఖలను మారుస్తున్నామన్నా రు. ఎన్నికల కోడ్ పూర్తి అయిన అనంతరం నిమ్మ రైతులకు వివిధ పథకాలు అందిస్తామని పొదలకూ రు ఉద్యాన శాఖాధికారి ఆనంద్ తెలిపారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి వ్యాధి నిరోధక టీకాలను వేస్తున్నట్లు పశువైద్యాధికారి బొడ్డు ప్రసాద్ తెలిపారు.

జెడ్పీటీసీ చిత్తలూరు పోలయ్య, సొసైటీ అధ్యక్షుడు కరణం శ్రీనివాసులునాయుడు, మండల ఉపాధ్యక్షురాలు కత్తి ఈశ్వరమ్మ, ఏఈలు శేషాద్రి, భాస్కర్ ఏపీఎం రాధరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రతిష్టాత్మకం



ఆత్మీయ పరిచయ కార్యక్రమంలో నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి

వెంకటగిరి: ప్రభుత్వం ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుందని తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం ప్రైవేటు విద్యాసంస్థల ఆధ్వర్యంలో తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆత్మీయ పరిచయ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో కృష్ణా, గుంటూరు ఎమ్మెల్సీ కల్పలతరెడ్డి, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జి.ఢిల్లీబాబు, టి. రమేష్‌బాబు, బీఎస్ చంద్రారెడ్డి, పెద్దసంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

వెలుగు సిబ్బందికి సంబంధం లేదు



మాట్లాడుతున్న కోఆర్డినేటర్ వెంకట్రావు

గూడూరు: చెన్నూరు గ్రామంలోని 6వ పొదుపు సంఘంలో జరిగిన రుణాల స్వాహా విషయంలో వెలుగు సిబ్బందికి ఎలాంటి సంబంధమూ లేదని వెలుగు కార్యాలయ కో–ఆర్డినేటర్ వెంకట్రావు పేర్కొన్నారు. పట్టణంలోని మండల సమాఖ్య కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆ సంఘబంధ సహాయకురాలు లక్ష్మికి, ఆ సంఘ సభ్యుల మధ్య జరిగిన లావాదేవీలకు, వెలుగు సిబ్బందికీ ఎలాంటి సంబంధం లేదన్నారు. రుణాల స్కాంలో కార్యాలయ సిబ్బంది ఉన్నారనడంలో ఏ మాత్రం వాస్తవం లేదని ఆయన తెలిపారు. ప్రయివేటు బ్యాంకులో పొదుపు రుణాల పేరిట నగదు డ్రా చేసి, గ్రూపు సభ్యులు పంచుకోవడంలో కార్యాలయ సిబ్బందికి ఏం సంబంధం ఉందని, ఆ విధంగా ఆరోపించడం సమంజసం కాదన్నారు. లావాదేవీలను పర్యవేక్షించాల్సిన సీసీ సక్రమంగా విధులకు హాజరు కావడంలేదని గుర్తించామని తెలిపారు. ఈ మేరకు ఈ విషయాన్ని పీడీ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఏపీఎం బుజ్జమ్మ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా కుంభాభిషేక పూజలు



కుంభాభిషేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు: గ్రామదేవత రాపూరమ్మ కుంభాభిషేక పూజలు బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయం పునఃనిర్మాణం చేపట్టి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం గణపతిపూజ యాగశాల ప్రవేశం, మహాకలశ అవాహన, ఉత్సవ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. గురువారం విగ్రహ ప్రతిష్ట, అమ్మవారికి గ్రామోత్సవం, అన్నదానం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న నెల్లూరు ఆర్డీఓ

రాపూరు: రాపూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లోని పోలింగ్ కేంద్రాలను బుధవారం నెల్లూరు ఆర్డీఓ మాలోల పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తూర్పురాయలసీమ, పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు మార్చి 13న జరగనున్నట్లు ఆయన చెప్పారు. అందుకు సంబంధించి పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసినట్లు చెప్పారు. మండలంలో 1,700 మంది ఓటర్లు ఉన్నారన్నారు, పట్టభద్రుల ఓటర్ల కోసం రెండు, ఉపాధ్యాయ ఓటర్ల కోసం ఒకటి పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ సుభాషిణి, సీఐ కోటేశ్వరావు, ఎస్ఐ క్రాంతికుమార్, సర్వేయర్ అశోక్ పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ డీటీగా ప్రసాద్



సైదాపురం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రీసర్వే డీటీగా విధులు నిర్వహిస్తున్న ప్రసాద్ బుధవారం ఇన్‌చార్జ్ డీటీగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. డీటీగా పనిచేస్తున్న విజయలక్ష్మి అడహక్ తహసీల్దార్‌గా పదోన్నతి కల్పిస్తూ ఉన్నతాధికారులు సైదాపురం తహసీల్దార్‌గా నియమించారు. ఖాళీగా ఉన్న ఆ పోస్టులో ప్రసాద్‌ను ఇన్‌చార్జ్‌గా నియమించారు.